అదనపు లోడ్ చార్జీలు ఆపాలి : మాజీ మంత్రి శివాజీ

విశాలాంధ్ర-పలాస : విద్యుత్ వినియోగదారుల వద్ద ప్రతి నెల ఎపిఇపిడిసిఎల్ సంస్థ స్లాబ్ సిస్టమ్ ద్వారా విద్యుత్ బిల్లులు వసూలు చేస్తుందని, అయితే దీనికి అదనంగా వినియోగదారులకు లోడ్ చార్జీల పేరుతో వేలల్లో డిమాండ్ చేస్తూ నోటీసులు ఇవ్వడం ఎంత వరకు సమంజసమని మాజీ మంత్రి గౌతు శివాజీ అన్నారు. ఈ మేరకు గురువారం పలాస విద్యుత్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలాస నియోజకవర్గం మందస, పలాస, వజ్రపుకొత్తూరు మండలాలతో పాటు పలాస మున్సిపాలిటీ పరిధిలో గల గ్రామాల్లో స్లాబ్ సిస్టమ్ ద్వారా విద్యుత్ వినియోగదారుల వద్ద ప్రతినెల విద్యుత్ బిల్లులు వసూలు చేస్తున్నారని, అయితే అదనంగా లోడ్ చార్జీలు పేరుతో వేలల్లో డిమాండ్ చేస్తూ నోటీసులు ఇవ్వడం అన్యాయమన్నారు. ఇప్పటికే ప్రభుత్వం పలుమార్లు అదనంగా పెంచిన విద్యుత్ చార్జీలు చెల్లించలేక ఆర్థిక పరమైన ఇబ్బందులకు వినియోగదారులు గురవుతున్నారని, అదనపు చార్జీలు చెల్లించమనడంతో వారిలో అయోమయం నెలకొందని అన్నారు. గతంలో ఎప్పుడు లేని విధంగా విద్యుత్ సంస్థ ఏ కారణం చేత ఈ అదనపు చార్జీలు వసూలు చేస్తున్నారో వినియోగదారులకు తెలియజేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై పైఅధికారుల నుంచి ఏమైనా లిఖితపూర్వక ఆదేశాలుంటే వాటిని తమకు అందజేయాలని కోరారు. ఈ విషయమై ప్రభుత్వం పునరాలోచన చేసి ఉన్నతాధికారులకు ఆదేశాలివ్వాలని, ప్రజలపై అదనపు లోడు భారాన్ని తగ్గించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ఎ.ఇకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వజ్జ బాబూరావు, లొడగల కామేష్ యాదవ్, విఠల్, నాగరాజు, నవీన్, గాలి క్రిష్ణారావు, శ్రీనివాసరావు, సూర్యనారాయణ, రవిశంకర్, శశిభూషణ్, యవ్వారి మోహనరావు, జోగ మల్లి, సురేష్, ఆత్మారావు, క్రిష్ణ, సత్యంలు పాల్గొన్నారు.

జగన్మోహన్‌రెడ్డి పాలనలో అర్హులందరి సంక్షేమ పథకాలు : ఎమ్మెల్సీ

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల అర్హులైన ప్రతి ఒక్కరికి అందడంతో అన్ని వర్గాల ప్రజలు సంతృప్తిగా ఉన్నారు. గడపగడపకు వెళుతుంటే ప్రజలు నుంచి విశేష స్పందన లభిస్తోందని, జగనన్నకు కృతజ్ఞతలు చెబుతున్నారని ఎమ్మెల్సీ, టెక్కలి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి దువ్వాడ శ్రీనివాస్ అన్నారు. ఆయన గురువారం మండలం చీపుర్లపాడు గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్ళి జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత వారికి అందిన సంక్షేమ ఫలాలుగూర్చి వివరించి, సమస్యలు ఉంటే తెలుసుకొని వెంటనే పరిష్కరిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన గ్రామస్థులతో మాట్లాడుతూ గత మూడేళ్లలో ప్రభుత్వం నుంచి లబ్ధి పొందిన అన్ని ఊర్లల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా తిరుగుతుంటే వేశేష స్పందన లబించిందన్నారు. ముఖ్యమంత్రి కులమత, పార్టీ లకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అమలుచేస్తున్నారన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలను అమలుచేయడమే కాకుండా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతుతున్నా మన్నారు. అనంతరం సమావేశ ప్రాంగానికి వచ్చిన వృద్దులు, వికలాంగులతో దువ్వాడ మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈకార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు బాదాన మురళి, మండల సచివాలయ కన్వీనర్లు ఇన్‌చార్జీ గద్దవలస నాగభూషణరావు, స్థానిక సర్పంచ్ నేతింటి చిన్నమ్మడు అప్పలస్వామి, ఎంపీటీసీ బొడ్డు అప్పన్న, మండల పార్టీ అధ్యక్షుడు నూక సత్యరాజు, మండల యూత్ అధ్యక్షుడు తర్ర కామినాయుడు, మండల గ్రీవెన్‌సెల్ అధ్యక్షుడు బమ్మిడి శ్రీనివాస్, బలగ సూర్యరావు, సనపల లక్ష్మణరావు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, గృహసారదులు తదితరులు పాల్గొన్నారు.

విలేఖరి శివాజీ కుటుంబాన్ని సాయిరాజ్ పరామర్శ

విశాలాంధ్ర-కవిటి : మండలంలోని జగతి గ్రామానికి చెందిన ప్రముఖ దిన పత్రిక కవిటి మండల విలేఖరి దెయ్యం శివాజీ అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల మృతి చెందాడు. విషయాన్ని తెలుసుకున్న ఇచ్ఛాపురం నియోజకవర్గం వైయస్సార్సీపి సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్ శివాజీ కుటుంబాన్ని పరామర్శించి తమ ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పూడి నేతాజీ, కవిటి మేజర్ పంచాయతీ సర్పంచ్ పూడి లక్ష్మణరావు, ఎంపీటీసీ ప్రతినిధి దుద్ది ధర్మారావు, పిన్నింటి జయరాం తదితరులు పాల్గొన్నారు.

టీబీ వ్యాధి బాధితులకు పౌష్టికాహార కిట్లు పంపిణీ

విశాలాంధ్ర-కొత్తూరు : మండలం కురిగాం ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం జిల్లా రెడ్‌క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో టిబి (క్షయ రోగులు) రోగులకు పౌష్టికహారా కిట్లును పంపిణీ చేసారు. ఈ సందర్భంగా జిల్లా రెడ్‌క్రాస్ సంస్థ అధ్యక్షులు జగన్మోహన్‌రావు మాట్లాడుతూ ప్రధానమంత్రి ఆరోగ్య రక్ష పథకంలో భాగంగా జిల్లాలో కొన్ని స్వచ్ఛంద సంస్థల సహకారంతో టిబి రోగులకు పౌష్టికాహర కిట్లను అందిస్తున్నట్లు తెలిపారు టిబి రోగులు వేగంగా కొలుకోవాలంటే పౌష్టికాహారం ముఖ్యమన్నారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సంస్థ సభ్యులు, కొన్ని స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

భక్తులతో కిటకిటలాడుతున్న శ్రీరామమందిరం

విశాలాంధ్ర -కోటబొమ్మాళి : మండలంలోగల చీపుర్లపాడు పంచాయతీ ఊడికలపాడు శ్రీరామమందిరంలో గడిచిన నాలుగు రోజులుగా ఓంకార నామమంతో, రాష్ట్ర నలుమూలలనుంచి వచ్చిన ప్రవచన కారులతో, భక్తులతో కిటకిటలాడుతుంది. ప్రతీ రోజు ప్రవణవనాధ, భాగవత, భగవద్గీత సప్తాహ ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పలు గ్రామాలనుంచి వచ్చిన భక్తులు పాల్గొనడంతో జనసంద్రంగా మారింది ఊడికలపాడు. గురువారం చీపుర్లపాడు సచివాలయ అధికారులు మహేష్, ప్రవీణ్, రాకేష్, ముకుంద, శిరిష, మహాలక్ష్మి, నారాయణమ్మ, రమ్మక్రిష్ణలకు శ్రీరామకృష్ణరమణకరుణ గీతాశ్రమంకు చెందిన సనపల కరుణ్‌కుమార్ ఘనంగా సన్మానించారు. అలాగే ప్రతిరోజు ఉదయం ఓంకారంతో పాటు గాయత్రీ మహాయజ్ఞం, గోపూజ ఉపాహారం, భాగవత, భగవద్గీత, సత్సంగాలతో గ్రామం ఆధ్యాత్మిక కేంద్రంగా మారింది. ప్రతి రోజు భక్తులకు అన్న ప్రసాదం కమిటి సభ్యులు నిర్వహిస్తున్నారు.

గాయపడ్డ వ్యక్తి మృతి

విశాలాంధ్ర-ఎచ్చెర్ల : మండలంలోని జరజాం సమీపంలో జాతీయ రహదారిపై గత నెల 29వ తేదీన జరిగిన ప్రమాదంలో గాయపడిన వ్యక్తి కామయ్య(48) చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. మండలం మురుపాక గ్రామానికి చెందిన ఆయన బైక్ పై వెళుతూ ఆగి ఉన్న లారీని ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఎచ్చెర్ల పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత

జనసేన నాయకులు లోల్ల రాజేష్

విశాలాంధ్ర-కవిటి : ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని ఇచ్ఛాపురం నియోజకవర్గం జనసేన నాయకులు లోల్ల రాజేష్ అన్నారు. ఈ మేరకు గురువారం మండలంలోని నెలవంక గ్రామంలో శ్రీఅసిరి పోలమ్మ అమ్మవారి త్రిదినాత్మక ఆలయ ప్రతిష్ట మహోత్సవం కార్యక్రమంలో ఇచ్ఛాపురం నియోజకవర్గ జనసేన నాయకులు లోళ్ళ రాజేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం అమ్మవారి ఆలయ అభివృద్ధికి కొంత మొత్తంలో నగదును విరాళంగా అందజేశారు. మండల పరిసర ప్రాంతాలలో జరుగుతున్న ఈ ఆలయ ప్రతిష్ట మహోత్సవాలు, మహా యజ్ఞలు, చాలా శుభప్రదం, ఆనందదాయకమని రాజేష్ కొనియాడారు. ఈ కార్యక్రమంలో నెలవంక గ్రామస్తులు, జనసైనికులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించండి : డ్వామా పీడీ చిట్టిరాజు

విశాలాంధ్ర-బూర్జ : పని ప్రదేశాలలో సమయపాలన పాటించడం ద్వారా గరిష్ట వేతనం పొందాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ జీవి చిట్టి రాజు ఉపాధి హామీ కూలీలను కోరారు. మంగళవారం పిఎల్ దేవి పేట పంచాయతీ పరిధిలో జరుగుతున్న చెరువు అభివృద్ధి పనులతోపాటు హార్టికల్చర్ పనులను పరిశీలించిన ఆయన ఈ సందర్భంగా కూలీలు మరియు ఉపాధి సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ, కనీసం 6 గంటల సమయం పాటు పనిచేయడం ద్వారా రూ 270 పైచిలుకు వేతనాన్ని కూలీలు పొందవచ్చునని ఆయన పేర్కొన్నారు. ఇటీవల ప్రభుత్వం వేతనదారులకు రోజుకు 15 రూపాయల వేతనాన్ని పెంచిందని వారికి తెలియజేశారు. సిబ్బంది నిర్దేశించిన కొలతల మేరకు పనులు చేయించాలని అన్నారు. గరిష్ట వేతనం పొందేందుకు గాను ఎంత మేర పని చేయాలన్న అంశంపై సిబ్బంది వేతనదారులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. చేపట్టిన పనులు గ్రామానికి, ప్రజలకు ఉపయుక్తంగా ఉండేలా కూలీలు, సిబ్బంది సమన్వయం చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పనుల్లో నాణ్యతకు, పారదర్శకతకు పెద్దపీట వేయాలని ఆయన సిబ్బందికి సూచించారు. సగటు వేతనం పెంపుదల, ప్రతి కూలీకి 100 రోజులు ఉపాధి పని దినాలు కల్పనపై సిబ్బంది ప్రత్యేక దృష్టిని సారించాలని ఆదేశించారు. లక్ష్యాలను చేరుకోలేని సిబ్బందిపై చర్యలు తప్పవని అన్నారు.. ఈ పర్యటనలో పిడి వెంట ఏపీవో రాజ్ కుమార్, టెక్నికల్ అసిస్టెంట్ రామకృష్ణ, ఇతర ఉపాధి హామీ పథకం సిబ్బంది ఉన్నారు.

4 నెలల బాలుడిని ఆదుకున్న 'అభయం' సేవా సంఘం

బాలుని వైద్యానికి రూ.30వేలు ఆర్థిక సాయం

విశాలాంధ్ర-టెక్కలి: మండలం నౌపడ రైల్వే స్టేషన్ సమీపం లో నివాసం ఉంటున్న దువ్వాడ తులసిరామ్, నీలిమ దంపతులకు నాలుగు నెలల కుమారుడు దువ్వాడ పునీత్ రాజ్ కుమార్ కు ఊపిరితిత్తులలో సమస్య వచ్చింది. ఆపరేషన్ చేయాలని డాక్టర్ లు సూచించారు.తండ్రి హాస్టల్‌లో అవుట్ సోర్సింగ్ కుక్ గా పనిచేస్తున్నారు, చాలీచాలని జీతంతో కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఇంతలో ఈ కుటుంభం కు గుండెలు పగిలేల పెద్ద సమస్యే వచ్చింది. ఈ చికిత్సకు ఆరోగ్య శ్రీ వర్తించకపోవడంతో కుమారుని కాపాడుకోవాలని దిక్కుతోచని స్థితిలో పలువురి దాతల సహాయం కోసం సోషల్ మీడియాలో పోస్ట్ చేయడం జరిగింది. ఈ విషయం తెలుసుకున్న టెక్కలి అభయం సేవాసంఘం వాళ్ళు వెంటనే స్పందించి పలువురి సభ్యుల ద్వారా అమౌంట్ సేకరించి ఈ రోజు పిల్లవాని తల్లిదండ్రులకు 30000 రూపాయల ను డాక్టర్ అన్నెపు వినోద్ చేతుల మీదుగా అందజేసినట్లు అభయం యువజన సేవాసంఘం అధ్యక్షుడు దేవాది శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మా అభయం సేవాసంఘం పిలుపుమేరకు స్పందించి సాయమందించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలియజేసారు. ముఖ్యంగా పాతపట్నం బ్లడ్ గ్రూప్ సభ్యులు స్పందించిన తీరు అద్భుతమని ఆయన కొనియాడారు.ఈ కార్యక్రమంలో అభయం యువజన సేవాసంఘం అధ్యక్షుడు దేవాది శ్రీనివాసరావు, సెక్రటరీ లాడి కామేశ్వర రావు, డాక్టర్ అన్నేపు వినోద్, సంఘ సభ్యులు యన్.సింహాచలం, అద్దాల వీరభద్రాచారి పాల్గొన్నారు.

సెబ్ పనితీరు సంతృప్తికరం : జిల్లా ఎస్పీ రాధిక



విశాలాంధ్ర-శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం: జిల్లా స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో విభాగం పనితీరు సంతృప్తికరంగా ఉందని జిల్లా ఎస్పీ జి.ఆర్.రాధిక పేర్కొన్నారు. మెరుగైన ప్రతిభ కనబరిచి అక్రమ రవాణాను అరికట్టాలని ఎస్పి సూచించారు. జిల్లా ఎస్పీ రాధిక అధ్యక్షతన గురువారం జిల్లా పోలీస్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా స్పెషల్ ఎన్ఫోర్సీమెంట్ బ్యూరో విభాగం అధికారులతో నెల వారి నేర సమీక్షా సమావేశంను నిర్వహించారు. ఈ సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో విభాగము బాధ్యతగా పనిచేసి పెండిగులో ఉన్న కేసులను చేదించాలని ఎస్పీ తెలిపారు. వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను త్వరితగతిన డిస్పోజల్ చేయాలన్నారు. దర్యాప్తు అధికారులు కేసులు ఇన్వెస్టిగేషన్లో జాగ్రత్తలు పాటిస్తూ ముద్దాయిలకు శిక్ష పడేవిధంగా దర్యాప్తు పూర్తి చేయాలని సూచించారు.జిల్లాలో ఎస్.ఈ.బి , పోలీసు శాఖ సమన్వయంతో పనిచేసి సరిహద్దు ప్రాంతాలు నుండి నాటు సారా రవాణాపై ప్రతేక నిఘా పెట్టాలని ఆదేశించారు. అదేవిధంగా జాతీయ రహదారులు మరియు మారుమూల ప్రాంతాల్లో అక్రమంగా తరలిస్తున్న గంజాయిపై ప్రేత్యక దృష్టి సారించాలని సూచించారు. అక్రమంగా తరలిస్తున్న మద్యం రవాణాను అరికట్టేందుకు సరిహద్దు చెక్ పోస్ట్ లవద్ద ప్రతి వాహనాన్ని విస్తృతంగా తనిఖీలు నిర్వహించాలని అన్నారు. ముందస్తు సమచారం సేకరించి,నాటుసారా తయారీ,మద్యం రవాణాను అరికట్టేందుకు ప్రేత్యక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎటువంటి తప్పులు లేకుండా ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.నాటు సారా వలన కలిగే దుష్ప్రభావాలు గురించి గ్రామీణ ప్రాంతాల్లో అవగాహనా కార్యక్రమాలు నిర్వహిచి ప్రజల్లో చైతన్యం కలిపించి వారిలో మార్పు తీసుకురావాలని ఎస్పీ తెలియజేశారు. అనంతరం విధి నిర్వహణలో ఉత్తమ పనితీరు కనబర్చిన ఎన్ఫోర్స్మెంట్ అధికారులు, సిబ్బందికి ప్రశంసా పత్రలను అందజేసి పేత్యేక అభినందనలు తెలియజేశారు. ఈ సమావేశంలో సెబ్ జాయింట్ డైరెక్టర్ ఎం. నాగ మణికంఠ,సెబ్ సూపరిడెంట్ కె పి గోపాల్,సంబంధిత విభాగం సీఐలు,ఎస్.ఐలు పాల్గొన్నారు.

'యువివి'కి ఆర్థిక సాయం

విశాలాంధ్ర-కాశీబుగ్గ : ఉద్దాన ప్రాంతంలో విద్యాభివృద్ధి కోసం మండలం నీలావతి గ్రామంలో ఏర్పాటుచేసిన ఉద్దాన ప్రాంత విద్యాభివృద్ధి వేదిక (యువివి) ఆధ్వర్యంలో నిర్మిస్తున్న గ్రంథాలయ నూతన భవనానికి అన్నపూర్ణ విద్యానికేతన్ యాజమాన్యం 5100 రూపాయల ఆర్థిక సహాయాన్ని గురువారం యువివి అకడమిక్ సెల్ కన్వీనరు బాలరాజుకు అందజేశారు. ఈ సందర్భంగా సురేష్‌కుమార్ మాట్లాడుతూ వెనుకబడిన గ్రామీణ ప్రాంతంలో గ్రంథాలయ నిర్మాణం చేపట్టడం ద్వారా ఎంతో మంది నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు వచ్చే పరిస్థితులు ఉన్నాయని అన్నారు. గ్రంథాలయ అభివృద్ధికి ప్రతి ఒక్కరు సహకరించేందుకు ముందుకు రావాలని కోరారు.

భూసర్వేతో వెలుగు చూసిన చెరువు ఆక్రమణ

విశాలాంధ్ర-సోంపేట : ఈ మండలం బుషాభద్ర గ్రామంలో చేపట్టిన భూసర్వే ద్వారా రైతులకు ఎంతో ప్రయోజనకరమైన ఒక చెరువు ఆక్రమణకు గురైన విషయం వెలుగులోకి వచ్చింది. సుమారు 9.75 ఎకరాల సాగునీటి చెరువులో ఎకరా స్థలాన్ని ఓ వ్యక్తి ఆక్రమించుకుని తన స్వప్రయోజనాలకు వాడుకుంటున్నాడు. సదరు భూమి తన సొంతమేనని ప్రజలకు నమ్మించాడు. అయితే ప్రభుత్వం చేపట్టిన భూసర్వే ద్వారా హద్దులు నిర్ణయించడంతో అసలు విషయం బయటపడింది. ఇందుకోసం ఆ గ్రామా నికి చెందిన సంఘసేవకుడు పల్లి హరిశ్చంద్ర రావు, పలాసపురం గ్రామానికి చెందిన పర్యా వరణ పరిరక్షణ సంఘం ప్రధాన కార్యదర్శి బీన ఢిల్లీరావు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయ దం ద్వారా బుషాభద్ర గ్రామంలో చెరువు రీసర్వే చేపట్టడం జరిగింది. ఇందుకు కృషిచేసిన వైసీపీ కన్వీనర్ పిరియా సాయిరాజ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

వివాహానికి 20వేలు ఆర్థిక సాయం అందజేత

విశాలాంధ్ర-పాతపట్నం : దత్తత తీసుకున్న తామర గ్రామానికి చెందిన ప్రతి ఒక్క ఆడపిల్ల వివాహానికి పసుపు కుంకుమ క్రింద గ్రామ ఆడపడుచు వివాహానికి ఆర్థిక సహాయం అందజేస్తున్నారు. సామాజికవేత్త మామిడి గోవిందరావు. పాతపట్నం నియోజకవర్గం, పాతపట్నం మండలం తామర గ్రామానికి గత 15 సంవత్సరాలుగా ప్రముఖ సామాజికవేత్త తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మామిడి గోవిందరావు దత్తత గ్రామంగా తీసుకున్నారు. అదే గ్రామంలో ఉన్నటువంటి ఆడపడుచు రాడా రామారావు-రమ దంపతుల కుమార్తె (వందన) వివాహానికి రూ. 20వేలు పెండ్లి కానుకగా గురువారం మామిడి గోవిందరావు (ఎంజీఆర్) ఆర్థిక సహాయం అందజేశారు. ఆయనతోపాటు పడ్డాను డిల్లేశ్వరరావు, సాసుపల్లి దాలిరాజు, వందాన శేఖర్, సిరిపురం బాబురావు, బోను వెంకట రమణ, యలకల వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వర స్వామి కళ్యాణానికి అందరు ఆహ్వానితులే

విశాలాంధ్ర - పాతపట్నం : మండలం బోరు భద్ర గ్రామములో వైశాఖ పౌర్ణమి సందర్భంగా శుక్రవారం 05/05/2023 నాడు శ్రీ వెంకటేశ్వర కళ్యాణం జరుగుతుందని, అదేవిధంగా అన్నదాన కార్యక్రమం మరియు సత్యహరిచంద్ర పౌరాణిక నాటకం ప్రదర్శించ బడుతుందని, కావున గ్రామ మరియు పరిసర ప్రాంతాల ప్రజలు ఈ కార్యక్రమాల్లో పాల్గొని జయప్రదం చేసి స్వామి వారి కృపకు పాత్రులు కాగలరని బోరుభద్ర సర్పంచ్ సవిరిగాన శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో కోరారు.

మరలా మీరే సీఎం

జగన్‌తో అందవరపు

విశాలాంధ్ర-శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం: మీ పాలనపై ప్రజలు ఎంతో సంతప్తిగా వున్నారని, మరలా మీరే సీఎం అవుతారని, దేవుని కృప, ప్రజల ఆశీస్సులు మీకే నిండుగా ఉన్నాయని కళింగ వైశ్య, భేరి వైశ్య కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు సీఎం జగన్‌తో అన్నారు. భోగాపురం అంతర్జాతీయ ఎయిర్‌పోర్టుకు శంకుస్థాపన సందర్భంగా భోగాపురానికి వచ్చిన సీఎం జగన్‌మోహనరెడ్డిని సూరిబాబు మర్యాదపూర్వకంగా బుధవారం కలుసుకొని వెంకటేశ్వరస్వామిని ప్రతిమను అందించారు. జిల్లాపరిషత్ చైర్మన్, జిల్లాపార్టీ అధ్యక్షులు చిన్నశ్రీను, నెల్లిమర్ల శాసన సభ్యులు బడుకొండ అప్పలనాయుడులు నెల్లిమర్ల నియోజకవర్గ పరిశీలకులు అంధవరపు సూరిబాబు పనితీరును సీఎం జగన్‌మోహనరెడ్డి దృష్టికి తెచ్చారు.

చంద్రబాబు అక్రమాలపై సిట్ దర్యాప్తు చేయాలి

మాజీ డిప్యూటీ సిఎం, ధర్మాన కృష్ణదాస్

విశాలాంధ్ర-నరసన్నపేట: ప్రతిపక్ష నాయకుడు, చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా వున్నంత కాలం రాష్ట్రంలో అవినీతి, అక్రమాలకు అడ్డు లేకుండా పోయిందని మాజీ డిప్యూటీ సిఎం, ధర్మాన కృష్ణదాస్ విమర్శించారు. గురువారం ఆయన వైసిపి కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ సిట్ ఏర్పాటుపై సుప్రీంకోర్టు తీర్పుని వెంటనే ఆచరణలో పెట్టి, దర్యాప్తు ఆరంభించాలని కోరారు. అమరావతి రాజధాని పేరుతో పెద్ద ఎత్తున జరిగిన భూ కుంభకోణమే కాకుండా టిడిపి హయాంలో శ్రీకాకుళం జిల్లాలో వందల కోట్ల రూపాయలు కుంభకోణాలున్నాయని దుయ్యబట్టారు. బినామీ పేర్లతో తిత్లీ తుఫాన్ పరిహారం ప్రక్కదారి పట్టించటం, వంశధార యూత్ ప్యాకేజీ అవకతవకలపై దర్యాప్తు చేయాలని సిట్‌ని కోరుతున్నామని అన్నారు. అన్ని ఆధారాలను సిట్ బృందానికి అందజేస్తామని, నేటికి చంద్రబాబు పాపాలు పండే రోజులు దగ్గర పడ్డాయని తెలిపారు. ప్రభుత్వ నిర్ణయాలు ప్రజలకు నష్టం కల్గించినపుడు ఖచ్చితంగా సమీక్ష జరగాల్సిందేనని, అమరావతి భూ దందా నిజం అని చెప్పటానికి ఇప్పుడు మార్గం సుగమం అవుతుందని అన్నారు. ఫైబర్ నెట్, స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో చంద్రబాబు పాత్ర ఇప్పటికే స్పష్టమైందని, దర్యాప్తు చేస్తే వేధింపులు, చెయ్యకపోతే ధైర్యం లేదంటూ చంద్రబాబు మాట్లాడుతున్నారని, దర్యాప్తులో అన్ని తెలుస్తాయని పేర్కొన్నారు. తప్పులు చేస్తూ స్టేలు తెచ్చుకుంటూ వాళ్ళు రోజులు నెట్టుకొచ్చారని, ఇప్పుడు సుప్రీంకోర్టు తీర్పు వారికి ఒక చెంప పెట్టని కృష్ణదాస్ విమర్శించారు.

బంగారు పతకం అందుకోనున్న కలెక్టర్

విశాలాంధ్ర-శ్రీకాకుళం : రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల ఆధ్వర్యంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు, సామాజిక చైతన్య వంతమైన కార్యక్రమాలు నేపథ్యంలో గవర్నర్ చేతుల మీదుగా ప్రతిఏటా అవార్డులు ప్రదానం చేస్తారు. ఈఅవార్డుల ప్రదానోత్సవానికి రాష్ట్ర వ్యాప్తంగా ఐదు జిల్లాల కలెక్టర్లు ఈ అవార్డుకు ఎంపిక కాగా అందులో శ్రీకాకుళం జిల్లాశాఖ ద్వారా రక్త సేకరణ, మొక్కలు నాటే కార్యక్రమం, టి.బి., ఎయిడ్, హెచ్.ఐ.వి. వ్యాధిగ్రస్తులకు న్యూట్రిషన్ ఫుడ్ అందించుట, స్వచ్ఛభారత్, రెడ్ క్రాస్ ఆధునికరణకు నిధులు మంజూరు చేయడం తదితర విశిష్ట సేవలందించిన శ్రీకాకుళం జిల్లాకు గౌరవం దక్కింది. ప్రపంచ రెడ్ క్రాస్ దినోత్సవంలో భాగంగా ఈ నెల 8న రాజ్‌భవన్‌లో జరిగే కార్యక్రమంలో గవర్నర్ నుంచి జిల్లా రెడ్ క్రాస్ అధ్యక్షులు, కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ బంగారు పతకం అందుకోనున్నారు.

రహదారుల ఏర్పాటుతో గ్రామాల మధ్య అనుసంధానం

- బొబ్బిలి పేట కట్యాచార్యుల పేట గ్రామాల మధ్య రహదారి
- వైసీపీ నాయకులు తమ్మినేని చిరంజీవి నాగ్

విశాలాంధ్ర-ఆమదాలవలస : మండలంలో ప్రతి గ్రామానికి రహదారుల నిర్మాణం అందుబాటులోకి తీసుకు వచ్చేలా స్థానిక శాసనసభ్యులు, ఏపీ శాసనసభాపతి తమ్మినేని సీతారాం కృషి చేస్తున్నారని వైసీపీ రాష్ట్ర యువజన విభాగ ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవి నాగ్ అన్నారు. గ్రామాల మధ్య రోడ్డు కనెక్టివిటీ పెంచడం ద్వారా, ప్రజా రవాణా మెరుగుపడుతుందని ఆయన అన్నారు. గురువారం మండలం బొబ్బిలిపేట, కట్యాచార్యుల పేట గ్రామాల మధ్య బిటి రోడ్డు నిర్మాణానికి అధికారులతో కలిసి పరిశీలించారు. రెండు గ్రామాల మధ్య 1.5 కిలోమీటర్లు పొడవున్న గోర్జను రహదారిగా రూపుదిద్దుతే రవాణా సులభతరం అవుతుందన్నారు. ప్రస్తుతం రెండు గ్రామాల మధ్య ప్రయాణం దూరం భారంగా మారిందన్నారు. బొబ్బిలి పేట నుండి కట్యాచార్యుల పేట కు వెళ్లాలంటే వెదుళ్ళ వలస గ్రామం మీదగా చేరుకోవలసి వస్తుందన్నారు. దీనివలన ఐదు కిలోమీటర్లు ప్రయాణించాల్సి వుందన్నారు.ఈ విషయాన్ని రెండు గ్రామాలకు చెందిన స్థానిక ప్రజా ప్రతి నిధులు స్పీకర్ తమ్మినేని దృష్టికి తీసుకు వచ్చారన్నారు. 1.5 కిలోమీటర్ల రహదారి నిర్మాణానికి స్థానిక సచివాలయ సిబ్బంది, మండల సర్వేయర్ బొడ్డేపల్లి గోపి, ఇంజనీరింగ్ అధికారులతో కలిసి చిరంజీవి నాగ్ పరిశీలించారు. వెంటనే అంచనాలు రూపొందించాలని ఇంజనీరింగ్ అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఏన్ని రామచంద్రయ్య, గురుగు బెల్లి చంద్రయ్య, వసంత,తదితర వైఎస్ఆర్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

15వ రోజు అన్నా క్యాంటీన్ కొనసాగింపు



విశాలాంధ్ర -శ్రీకాకుళం రూరల్: అన్నం పరబ్రహ్మ స్వరూపమని మాజీ ముఖ్యమంత్రి, టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు స్ఫూర్తితో ప్రారంభించిన అన్నా క్యాంటీన్ పేదల ఆకలి తీరుస్తోందని టిడిపి నియోజకవర్గ యువ నాయకులు, సర్పంచ్ ల సంఘ జిల్లా అధ్యక్షులు గొండు శంకర్ అన్నారు. టీడీపీ యువనాయకులు, సర్పంచ్‌ల సంఘ జిల్లా అధ్యక్షులు గొండు శంకర్ ఆధ్వర్యంలో నడుస్తున్న అన్నాక్యాంటీన్ బుధవారం 15వ రోజు కొనసాగించారు. అలాగే పాత బస్టాండ్ లో నాలుగో రోజు కూడా అన్న క్యాంటీన్ ను నిర్వహించారు. అలాగే మొబైల్ వ్యాన్ల ద్వారా నగరంలో పల్చోట పేదలకు నిరాశ్రయులకు భోజనాలను అందజేశారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ పేద బడుగు బలహీన వర్గాల పార్టీ తెలుగుదేశం పార్టీ, మళ్ళీ తెలుగుదేశం ప్రభుత్వం 2024లో అధికారంలోకి వస్తుందన్నారు. 2024లో ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు మరలా అన్నా క్యాంటీన్లను కొనసాగిస్తారని చెప్పారు. అన్న క్యాంటీన్‌ల ద్వారా ప్రతిరోజు జిల్లాలో వేలాది మంది కడుపు నింపుకునే వారన్నారు. చంద్రబాబునాయుడు మరలా ముఖ్యమంత్రిగా రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు అనుకూలమైన పాలన అందిస్తారని, నేటి వైస్సార్సీపీ పాలనలో రాష్ట్రంలో పెరిగిన నిత్యావసరధరలతో పేదల, సామాన్యుల బతుకులు చిన్నాభిన్నమైనవని ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు 450 మంది అన్నార్తులు భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ అంబటి లక్ష్మిరాజ్యం, టి ఎన్ ఎస్ ఎఫ్ నియోజక వర్గ అధ్యక్షులు రెడ్డి శంకర్, సిపురు రమణ, లొట్టి జగన్, పేట పద్మా, పార్వతమ్మ,శిమ్మ శ్యాంసుందర్, బలివాడ ప్రసాద్ , మోహన్, నర్సింహా తదితరులు పాల్గొన్నారు.

ఏ.పి.ఎస్.ఆర్.టి.సి. విశ్రాంత ఉద్యోగుల సమావేశం

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్ : బొత్స గౌరు అధ్యక్షతన జిల్లా ఏ.పి.ఎస్.ఆర్.టి.సి విశ్రాంత ఉద్యోగుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం నకు విశిష్ట అతిథి గా రాష్ట్ర అధ్యక్షులు వి.వి.కె.రాయ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్. అప్పారావు, ఎస్. ఎస్. ఆర్. శర్మ, గౌరవ అతిధి విజయనగరం జిల్లా కార్యదర్శి అసింగ్ని శ్రీరాములు, అధ్యక్షులు ఆర్.ప్రసాదరావు కార్యనిర్వాహక అధ్యక్షులు ఎం.పెంటయ్య, టెక్కలి, పాలకొండ, రాజాం, నరసన్నపేట, శ్రీకాకుళం 1, 2 డిపోల పరిధుల్లో ఉన్న నాయకులు. విశ్రాంత ఉద్యోగులు హాజరయ్యారు. రాష్ట్ర అధ్యక్షులు వి.వి.కె.రాయ్ మాట్లాడుతూ సూపర్ లగ్జరీ సదుపాయం కల్పించాలని, దాని పై సంబంధిత అదికారులతో మాట్లాడడం జరిగిందని, అదేవిధంగా ప్రభుత్వం పెంచిన దహనఖర్చులు రూ. 25వేలు, విశ్రాంత ఉద్యోగులకు కూడా వర్తింపచేయాలని కోరారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్. అప్పారావు, ఎస్.ఎస్.ఆర్.శర్మ, విజయనగరం కార్యదర్శి శ్రీరాములు మాట్లాడుతూ హైయ్యర్ పెన్షన్, మినిమం పెన్షన్ సి.ఎల్. గ్రాడ్యూటీ వర్తింపు చేయాలని కోరారు. ఈ సందర్భంగా విశ్రాంత ఉద్యోగి(ఎల్.ఏ.రావు) మరణానికి నివాళులర్పించారు. ఈ సమావేశానికి ఆర్.పి.రావు, ఎం.పెంటయ్య, రామారావు, జె.సత్తిరాజు, జి.ప్రసాద్, సత్యం, స్వామి, నారాయణ, ప్రభాకర్, శాస్త్రి, ప్రసాద్, శామ్యూల్, చిన్నారావు, గురువులు, కన్నయ్య, చిన్నారావు, పాపారావు, రాజారావు, తదితరులు హాజరయ్యారు.

11న హెచ్‌సీఎల్ ఉద్యోగాలకు ఎంపికలు

విశాలాంధ్ర-ఎచ్చెర్ల : ఏపీఎస్ఎస్‌డీసీ, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ లిమిటెడ్ సంయుక్త ఆధ్వర్యంలో హెచ్‌సీఎల్ టెక్బీ ప్రోగ్రాం ద్వారా ఈ నెల 11న ప్రభుత్వ డిగ్రీ కళాశాల (శ్రీకాకుళం)లో హెర్లీ ట్రైనింగ్ ప్రోగ్రాం ద్వారా క్యాంపస్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పీబీ సాయిశ్రీనివాస్ తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు 6 నెలల క్లాస్ రూమ్ ట్రైనింగ్ ఉంటుందని, అలాగే అవసరమైన లాప్‌టాప్, ఇంటర్నెట్ కోసం నెలకు 650 రూపాయలు హెచ్‌సీఎల్ కంపెనీ అందిస్తుందని చెప్పారు. చివరి ఆరు నెలలు ఇంటర్న్‌షిప్ కోసం నిర్దేశించిన హెచ్‌సీఎల్ క్యాంపస్‌కు వెళ్లాల్సిఉంటుందన్నారు. ఈ ట్రైనింగ్ కోసం అభ్యర్థులు 1,18,000 రూపాయలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఆర్థికంగా వెనుకబడిన అభ్యర్థులు 30 వేలు చెల్లిస్తే, మిగిలిన 88వేలు యాక్సిస్ బ్యాంకు నుంచి ఎడ్యుకేషన్ లోన్ పొందవచ్చన్నారు. అనంతరం వీరికి 1.72 నుంచి 2.2. లక్షల రూపాయల వార్షిక వేతనం పొందవచ్చన్నారు. ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

రాయలలో క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించిన సిరిపురం

విశాలాంధ్ర-కొత్తూరు : మండలం రాయల గ్రామంలో క్రికెట్ టోర్నమెంట్‌ను గురువారం ప్రముఖ విద్యావేత్త సిరిపురం ప్రారంబించారు, యువకులు విద్యతో పాటు క్రీడల్లోను రణించాలని వేద్యావేత్త సిరిపురం తేజేశ్వరరావు అన్నారు, క్రమశిక్షన, ఏకాగ్రత యువకుల్లో అవసరమని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ నాగవంశపు జానకి, ఉప సుర్పంచ్ ఎస్.గోవింద్‌రావు ఆదివాసీ సంక్షేమ పరిహత్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వాబ్ యోగి, ,బిజెపి కొత్తూరు మండల కమిట్ అధ్యక్షులు వలరౌతు ప్రసాదరావు, సిరిపురం మిత్రబృందం పి.షణ్ముఖరావు, ధారపు గోవింద్ రావు, పైల భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.